


సమావేశంలో మల్లికామోహన్‌దాస్, డాక్టర్ బషీ, ప్రొఫెసర్ బార్తోలోమియో తదితరులు

# రోగనిర్ధారణతో చికిత్సలు సులభం

**చెన్నై, న్యూస్‌టుడే:** అనేక రకాల నూతన వ్యాధులు వెలుగులోకి వస్తున్న తరుణంలో వైద్య పరీక్షలు అనివార్యం. పరీక్షల అనంతరం సమస్యలను గుర్తించి సులభతరంగా చికిత్సలు అందించే సౌకర్యం ఏర్పడుతుందని వైద్యులు పేర్కొన్నారు. గురువారం మియాట్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో 'ఎండోవస్కులర్ గ్రాఫ్టింగ్' శస్త్ర చికిత్సలకు సంబంధించి హృద్రోగ నిపుణులు డాక్టర్ బషీ, ఎండీ మోహన్‌దాస్, ఛైర్మన్ మల్లికామోహన్‌దాస్ తదితరులు ఈ విషయాలు తెలిపారు. రక్తనాళం (బృహద్ధమని) ఉబ్బటం వల్ల తలెత్తే సమస్యలు అత్యంత ప్రమాదకరమని, సత్వర చికిత్స అందని పక్షంలో ముప్పు తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణ స్థాయి కంటే ఈ రక్తనాళం ఒకటిన్నర రెట్లు మేరకు ఉబ్బితే వైద్య పరిభాషలో దీనిని 'ఎన్యూరిజం'గా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ సమస్య గుండె, ఉదర ప్రాంతాల్లో వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రస్తుతం దేశంలో ఏడు లక్షల మంది పైచిలుకు ఇలాంటి సమస్యతో సతమతమవుతుండగా రెండు వేల మందికి శస్త్రచికిత్సలు జరిగాయని గణాంకాలు వివరించారు.

### అధిక రక్తపోటు...

అధిక రక్తపోటు, మధుమేహం, ఊబకాయం, ధూమపాన ప్రియులకు, ముఖ్యంగా 60 సంవత్సరాలు పైబడిన వారికి ఈ సమస్య ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఎన్యూరిజంకు సంబంధించి ఎటువంటి వ్యాధి లక్షణాలు కనిపించనప్పటికి.. గుండె, కడుపునొప్పి వచ్చినపుడు ఇది బయటపడే అవకాశం ఉందని తెలిపారు. గుండెకు సంబంధించి 'ఎక్స్‌రే', 'అల్ట్రాసౌండ్' వైద్య పరీక్షల్లో దీనిని గుర్తించవచ్చని పేర్కొన్నారు. రక్తనాళాలు ఉబ్బి రక్తం పలు అవయవాల వెలుపలి గుండా ప్రవహించినప్పుడు పరిస్థితి విషమిస్తుందన్నారు. చికిత్సలు క్లిష్ట తరమైనప్పటికీ హుటాహుటీన వైద్య పరీక్షలు నిర్వహించి 'ఎండోవస్కులర్ స్టెంటింగ్' పరికరాన్ని ఎన్యూరిజంలోకి పంపి పరిస్థితిని సరిదిద్దుతున్నామని వివరించారు. తమ ఆసుపత్రిలో ఇప్పటి వరకు 150 మందికి ఈ చికిత్సలు నిర్వహించగలిగామని తెలిపారు. దీనికి సంబంధించి నిర్వహిస్తున్న అంతర్జాతీయ 'ఆరోటిక్' సదస్సులో ఇటలీకి చెందిన ప్రముఖ హృద్రోగ నిపుణులు ప్రొఫెసర్ బార్తోలోమియో, రోమ్ దేశానికి చెందిన ప్రొఫెసర్ రుగ్గెరో పాలిస్, జర్మనీకి చెందిన డాక్టర్ మలక్‌లాల్ శ్రేష్ఠ తదితరులు ప్రసంగించారు.